01ATP18F_01ATP18F.qxd 18-05-2025 PM 10:51 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 19 మే 2025 పేజీలు : 04




వధువరులను ఆశీర్వదిస్తున్న వైఎస్.విజయమ్మ

# వివాహ వేడుకకు హాజరైన వైఎస్.విజయమ్మ

**అనంతపురం సిటీ, మే 18 ప్రభాతవార్త**

నగరంలో జరిగిన వివాహ వేడుకకు వైఎస్.విజయమ్మ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. వైఎస్ఆర్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు గొర్ల మారుతినాయుడు మేనల్లుడైన పార్లపల్లి రమణ, కుమారుడు యతేంద్రచౌదరి-దివ్యశ్రీల వివాహానికి వైఎస్.విజయమ్మ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. వైఎస్.విజయమ్మతోపాటు వైఎస్.భారతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నేతలు వైఎస్.విజ యమ్మను మర్యాద పూర్వకంగా కలిశారు.


వర్షానికి కారిన ఆర్టీసీ హైటెక్ బస్

నేడు రామగిరి ఎంపిపి ఉప ఎన్నిక

4 >>


# హంద్రీనీవా బహిరంగ చర్చకు నేను సిద్ధం

**- వైకాపా నేత శివరామిరెడ్డికి ప్రభుత్వ విప్ కాలవ ఛాలెంజ్.**

**అనంతపురం, మే 18 (ప్రభాతవార్త బ్యూరో)**

ఈనెల 21, 22వ తేదీల్లో ఉదయం 11 గంటలకు అనంతపురం ప్రెస్ క్లబ్లో హంద్రీనీవా ప్రాజెక్టుపై బహిరంగ చర్చకు తాను సిద్ధమేనని వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే శివరామిరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఛాలెంజ్ విసిరారు. చర్చకు మాజీ ఎమ్మెల్సీ తో పాటు వైకాపా తరఫున ఇద్దరు,ముగ్గురు నాయకులను పిలిపించుకున్న నాకు అభ్యంతరం లేదని, వైఎస్ జగన్ హయాంలో హంద్రీ నీవాకు పిడికెడు మట్టి కూడా వేయలేదని ఇప్పు డేమో చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేస్తుంటే వైసీపీ వారు ఆరోపణ చేస్తు న్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం అభివృద్ధి పనులపై చేసిన వ్యాఖ్యానాలపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ శివరాం రెడ్డి హంద్రీ నీవా పథకంపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ సవాల్ విసిరారు.. ఈ సవాలకు తాను టిడిపి తరఫున బహిరంగ చర్చకు సిద్ధమేనని, మాటలు కట్టిపెట్టి చర్చకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదివారం ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ వైసిపి హయాంలో హంద్రీనీవా ప్రాజెక్టు పనులను పూర్తిగా తొక్కిపెట్టి సీమ సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేశారని, ఈ పరిస్థితుల్లో నాటి ముఖ్యమంత్రి జగన్‌ను ఎందుకు గత ఐదేళ్ళ పాలనలో ప్రశ్నించలేకపోయారని వైసీపీ నాయకులను ఆయన నిలదీశారు. నాటి వైకాపా ప్రజాప్రతినిధులు, నేతల మూగనోము వల్లే అనంతపురం జిల్లాకు తీరని ద్రోహం జరిగిందన్నారు. హంద్రీనీవా పై ఉత్తుత్తి ఉత్తర్వులతో ప్రజలను నిలువునా వంచించినా నోరుమెదపని వైకాపా నేతలు అనంత వెంకటరామిరెడ్డి, శివరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి ని పునః ప్రారంభిస్తుంటే.. ఆయనపై విమర్శలు చేస్తుండటం శోచనీయమన్నారు. వారి విమర్శలకు సమాధానం ఇవ్వటానికి బహిరంగ చర్చకు రావాలనీ సవాల్ చేస్తే ఎవ్వరూ స్పందించలేదన్నారు. శివరామిరెడ్డి మాత్రం ఏదో ఒకటి మాట్లాడాలంటే... మాట్లాడాలన్నట్లు విమర్శలు చేశారన్నారు. హంద్రీనీవా పై వైకాపా తరఫున ఎవ్వరు చర్చకు వచ్చినా నిజాలను బట్టబయలు చేయ టానికి సిద్ధమేనన్నారు. రాయలసీమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టును పూర్తి నిర్లక్ష్యం చేస్తూ... ఐదేళ్లలో కనీసం గంపెడు మట్టి కూడా ఎత్తిపోయని వైకాపా ప్రభుత్వం ఏ మోఖం పెట్టుకుని మాట్లాడతారన్నారు. 2017 ఏప్రిల్లో ముఖ్యమంత్రి జన్మ దినోత్సవం సందర్భంగా 3850 క్యూసెక్కులకు అనుగుణంగా కాలువ విస్తరణ చేపట్టడానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లతో పలుమార్లు ప్రత్యేకంగా చర్చించి పనులు వేగవంతమైయేలా శ్రద్ధ పెట్టారన్నారు. 2019 ఎన్నికల నాటికి తమ ప్రభుత్వంలోనే దాదాపు 37శాతం పనులు పూర్త య్యాయన్నారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో జిల్లాలో సమావేశం పెట్టిన జగన్ ఉత్తుత్తి ఉత్తర్వులతో ప్రగాల్భాలు పలికారని గుర్తు చేశారు. ఆ తరువాత పనులు పూర్తిగా ఆపివేసారన్నారు. ప్రస్తుత బడ్జెట్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో హంద్రీ నీవాకు రు.3700కోట్లు కేటాయించి పనులు చేస్తుంటే అభినందించడం మాని సిగ్గులేకుండా వైకాపా నేతలు నోరుపారేసుకొంటున్నారని ధ్వజమెత్తారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు తాను సిద్ధమని, వైకాపా తరఫున నాలుగైదు మందిని పిలిపించుకున్న సరేనన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం పనులపై హాట్ హాట్ గా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. వైసిపి, టిడిపి నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.. ఇప్పుడు వైసీపీలో ఉన్న నేతలు మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారే.. అందుకే హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం పనులు టిడిపి కంటే కాంగ్రెస్ హయాంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి సీఎం గా ఉన్నప్పుడు ఆ తర్వాత ఎక్కువ జరిగాయని వైసీపీ నేతల అభిప్రాయం. అందుకే టిడిపి హయంలో హంద్రీ నీవా ను నిర్లక్ష్యం చేశారని వైసిపి నేతలు చెప్తుంటే రాష్ట్రంలో కూటమి సర్కార్ లో సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టి హంద్రీ నీవాకు భారీ ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తున్నారని టిడిపి నేతలు చెబుతున్నారు.. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ,వైసీపీ నేత అయిన మాజీ ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఒకరినొకరు చాలెంజులు విసురుకుంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ఉరవకొండ ప్రాంతంలోనీ వజ్రకరూరు మండలంలో హంద్రీనీవా నీవా సుజల స్రవంతి పథకం ప్రధాన కాలువ విస్తరణ పనులు పరిశీలించేందుకు వచ్చారు. ఆ సమయంలో సీఎం చేసిన వ్యాఖ్యలపై వైసిపి , టిడిపి నేతలు ఒకరినొకరు ఛాలెంజ్ లు విసురుకుంటున్నారు.

# ఎవరు వేస్ట్ కార్డో ఆలోచించుకోవాలి

**-ముగ్గురు సోదరులు ఎమ్మెల్యేలుగా ఉన్నా ఎంఎల్‌సి ఇచ్చి గౌరవించారు**

**-చీఫ్ విప్ నుండి విప్ ఇచ్చారంటే వేస్ట్ కార్డు ఎవరో తెలుసుకోవాలి**

**-రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుపై ఎంఎల్‌సి శివరామిరెడ్డి ధ్వజం**

**గుంతకల్లు, మే 18 ప్రభాతవార్త**

ఎవరి పార్టీలో ఎవరు వేస్ట్ కార్డో ఆలోచించుకోవాలని ఎంఎల్‌సి శివరామిరెడ్డి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును ఉద్దేశించి అన్నారు. వైసిపిలో శివరామిరెడ్డి వేస్ట్ కార్డు అన్న రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వ్యాఖ్యలపై ఎంఎల్‌సి ఘాటుగా స్పందించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబంలో ముగ్గురు సోదరులు ఎమ్మెల్యేలుగా వున్నా తనకు ఎంఎల్‌సి ఇచ్చి పార్టీలో గౌరవించారని గుర్తు చేశారు. టిడిపిలో చీఫ్ విప్‌గా, మంత్రిగా పనిచేసిన మీకు ప్రస్తుతం విప్ పదవి ఇచ్చారంటే వేస్ట్ కార్డు ఎవరో అర్థం చేసుకోవాలన్నారు. తమ పార్టీలో అందరికీ ప్రాధాన్యత వుంటుందని అవసరం వచ్చినప్పుడు గుర్తిస్తారన్నారు. 1999 నుండి 2004 వరకు కాలవ ఎంపిగా వున్న సమయంలో హంద్రీనీవాకు మూడుసార్లు శంకుస్థాపన చేసి మూడు కిలోమీటర్లు కూడా కాలువ తీయనప్పుడు ఆయన ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీనీవాను అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా పనిచేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004లో ప్రారంభించగా ఆయన మరణానంతరం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 2014లోపు జీడిపల్లి దాకా నీళ్ల తెచ్చామని గుర్తు చేశారు. 700 క్యూసెక్కుల సామర్థ్యం వున్న హంద్రీనీవాను వైకాపా హయాంలో 2 వేల క్యూసెక్కులకు పెంచామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 700 కోట్లతో టెండర్లను పిలిచి సబ్ కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేస్తూ 3850 క్యూసెక్కులకు పెంచుతామని చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలువకు కేవలం అటు ఇటు కొద్దిగా మట్టి తీస్తున్నారే తప్పా చేస్తున్నదేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అనంతపురం జిల్లా అంటే ఎంతో అభిమానం అని చెబుతున్న కాలవ శ్రీనివాసులు కేంద్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళగిరికి తరలిస్తుంటే ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం అధినేత దగ్గర మార్కులు కొట్టేసి వున్న మంత్రిని పీకేసి మంత్రి పదవి పొందడానికి మాత్రమే మాట్లాడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై చర్చించడానికి ఎప్పుడు ఎక్కడికైనా రావడానికి సిద్ధమేనని ఆయన సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నక్కా భీమలింగప్ప, రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు, యూత్ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్‌బాసిత్, డోనేకల్లు సర్పంచు రాంబాబు, నాయకులు సూరి, శంకర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి శివరామిరెడ్డి

# మురళికి పరమ వీరచక్రకై ప్రతిపాదిస్తాం

**- వీర జవాన్ ఫ్యామిలీ నాడు ముంబై నివాసులే..మహారాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది**

**- దేశంలోనే బంజారా సమాజం మురళి కుటుంబానికి అండ**

**- మురళినాయక్ పెద్దకర్మ కార్యక్రమంలో మహారాష్ట్ర నీటిపారుదలశాఖా మంత్రి సంజయ్‌రాథోడ్**

**- కార్యక్రమానికి హాజరైన ప్రఖ్యాత తెలంగాణ సింగర్ మంగ్లీ**





మురళినాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్, సింగర్ మంగ్లీ

**గోరంట్ల, మే 18 ప్రభాతవార్త**

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రమూకలను అంతమొందించడానికి ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన బంజారా బిడ్డ మురళినాయక్‌కు కేంద్ర ప్రభుత్వం నుండి పరమవీరచక్ర బిరుదు అందే విధంగా మహారాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిపాదనలు పెడతామని మహారాష్ట్ర నీటిపారుదల శాశా మంత్రి సంజయ్‌రాథోడ్ పేర్కొన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన మురళినాయక్ పెద్దకర్మ కార్యక్రమానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన గోరంట్ల మండలంలోని కల్లితండాలోని వీర జవాన్ మురళినాయక్ నివాసానికి మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్‌తో పాటు ప్రఖ్యాత తెలంగాణ సింగర్ మంగ్లీ, కర్ణాటకకు చెందిన కేంద్ర మాజీ మంత్రి చౌహాన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళి నివాసంలో వారు మురళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జోహార్లు పలికారు. అనంతరం మహారాష్ట్ర మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి తాండాలోనూ మురళి చిత్రపటాలకు గిరిజనులు నివాళులు అర్పిస్తున్నారని దేశవ్యాప్తంగా బంజారాలు మురళి కుటుంబానికి అండగా వుంటున్నారని పేర్కొన్నారు. మురళి కుటుంబీకులు గతంలో ముంబై నగరంలో కొన్నేళ్లపాటు నివాసముండే వారని ఇప్పటికీ వారి సమీప బంధువులు అక్కడే వుంటున్నారని మురళి కుటుంబ సభ్యులను మేము స్థానికులుగా భావించి మా ప్రభుత్వం వారికి అండగా వుంటుందని అన్ని రకాల సహాయ సహకారాలు అందచేస్తామని తెలిపారు. వీరమరణం పొందిన మురళికి కేంద్ర ప్రభుత్వం పరమవీరచక్ర బిరుదు ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున డిమాండ్ చేస్తామని వారు తెలిపారు.

అనంతరం మురళి అంత్యక్రియలు నిర్వహించిన సమాధి వద్దకు వెళ్లి అక్కడ నివాళులర్పించి జోహార్లు పలికారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సిఐ బోయ శేఖర్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, బంజారా సంఘం రాష్ట్ర నాయకులు శంకర్‌లాల్‌నాయక్, గంపల రమణారెడ్డి, పుడగుండ్లపల్లి శివారెడ్డి, చింతా రామచంద్రారెడ్డి, గోరంట్ల జెడ్‌పిటిసి పాలే జయరాంనాయక్, నాగేనాయక్, సర్పంచు వాసునాయక్, రాజేష్‌నాయక్, మాజీ సర్పంచు రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

## దేశ భద్రత విషయంలో మన సైనికుల పాత్ర

# చరిత్రపుటల్లో నిలిచిపోతుంది

**- వీర జవాన్ మురళి నాయక్ సాహసం భారతావనికి తలమానికం - తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే కందికుంట**

**కదిరి, మే 18 ప్రభాతవార్త**

ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత సైనికులకు మద్దతుగా కదిరి పట్టణంలో ఆదివారం నిర్వహించిన తిరంగా ర్యాలీలో కూటమి నాయకులు, ప్రజలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ తిరంగ ర్యాలీ స్థానిక పివిఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కదిరి పురవీధుల గుండా కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలు ర్యాలీలో పాల్గొన్నారు. అమర వీరులకు జోహార్లు... వందే మాతరం భారత్ మాతాకీ జై అంటూ ప్రతి ఒక్కరు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లా డుతూ ఆపరేషన్ సింధూర్‌తో మన ఇండియన్ ఆర్మీ శక్తి ఏంటో ప్రపంచానికి చాటమన్నారు. ప్రతి భారతీయుడు ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ మన కేంద్ర ప్రభు త్వానికి, మన దేశ సైనికులకు మద్దతుగా యావత్ భారత్ నిలిచిం దని గుర్తు చేశారు. త్రివిధ దళాలకు మద్దతుగా ఈ తిరంగా ర్యాలిని నిర్వహించినట్లు ఎమ్మెల్యే కందికుంట తెలిపారు. మన దేశ భద్రత విషయాల్లో రాజీ పడ బోమనే ఉద్దేశ్యాన్ని ఇతర దేశాలకు ఒక హెచ్చరికను మన సైనికులు చూపిన పోరాట పటిమే ఇందుకు నిదర్శనం అన్నారు. పహల్గాం లాంటి సంఘటనల ఎపునరావృతమైతే ఆపరేషన్ సిందూర్ లాంటివి కూడా మళ్ళీ పునరావృతం అవుతాయనీ, అందుకు ఇండియా ఆర్మీసిద్ధంగా ఉందని తెలిపారు. ఉగ్రవాదంపై మన రక్షణ దళాలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరప్రసాద్, వాల్మీకి పవన్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, బిజెపి రాష్ట్ర యువమోర్చా నాయకులు వంశీలు సెల్యూట్ చేసారు. ప్రపంచం గర్వించదగ్గ మన రక్షణ కవచంలా మన త్రివిధ దళాలు ఒక్క భారతదేశంలోనే ఉన్నాయనీ గర్వపడుతున్న ముఖ్యంగా మన గోరంట్ల మండలానికి చెందిన వీర జవాన్ మురళి నాయక్ యావత్ భారతావనిలో హీరోగా మిగిలి శత్రుముఖాలను చెండాడి వీర స్వర్గం అతనికి అతని కుటుంబానికి కొండంత అండగా ఉంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కదిరి పురవీధుల్లో ప్రతి ఒక్కరూ జాతీయజెండాల పట్టుకుని వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. అనంతరం జాతీయ గీతా లాపన గావించి జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, పట్టణ సిఐ డి.వినారాయణరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కదిరిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు కార్యకర్తలు

# గ్రామ పొలితో ముగిసిన నసనకోట దుర్గమాంబ జాతర మహోత్సవాలు

**- చివరి రోజు వైభవంగా సాగిన కార్యక్రమాలు - చివరి రోజు వైభవంగా సాగిన కార్యక్రమాలు**

**- వెంకటాపురంలో భారీ స్థాయిలో విందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్**



ఎమ్మెల్యే పరిటాల సునీతతో గ్రామస్తులు



భక్తులకు, ప్రజలకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

**రామగిరి, మే 18 ప్రభాతవార్త**

ఐదు రోజులపాటు ఎంతో వైభవంగా సాగిన దుర్గమాంబ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. చివరి రోజు గ్రామ పొలి కార్యక్రమంతో వేడుకలు ముగిసాయి. దాదాపు 64 ఏళ్ల తర్వాత నసనకోట దుర్గమాంబ జాతర మహోత్సవాలు నిర్వహించడం ఇదే తొలిసారి. సుమారు నెలరోజుల పాటు మూడు గ్రామాల ప్రజలు ఎంతో కష్టపడి ఏర్పాట్లు చేశారు. ఐదు రోజులపాటు దుర్గమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ, పోతురాజుల స్వాములకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం కూడా వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు పరిటాల శ్రీరామ్ స్వయంగా దగ్గరుండి ఈ జాతర మహోత్సవాల్ని నిర్వహించారు. ప్రతి కార్యక్రమంలోనూ పరిటాల కుటుంబం పాల్గొంటూ నసనకోట, వెంకటాపురం, గంగంపల్లి గ్రామాల ప్రజలను ఐక్యం చేసి జాతర మహోత్సవాలను నిర్వహించారు. చివరి రోజు గ్రామ పొలి అనంతరం మూడు గ్రామాల్లో విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చాలా ఏళ్ల తర్వాత జాతర మహోత్సవం జరగడంతో ప్రతి ఇంట్లోనూ బంధువుల సందడి కనిపించింది. వెంకటాపురంలో భారీ స్థాయిలో విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, సిద్దార్థ స్వయంగా అథితులకు భోజనం వడ్డించారు. కర్ణాటకకు చెందిన మాజీ మంత్రి వెంకటరమణప్ప, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్‌తో పాటు పలువురు ప్రముఖులు కూడా చివరి రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. 800 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఆలయ విశిష్టతను తెలిపే విధంగా ఈ జాతర మహోత్సవాలు జరిగాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు అన్నారు. నెలరోజుల పాటు కష్టపడ్డ ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులకు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇక నుంచి జాతర మహోత్సవాలు తరచుగా జరుగుతుంటాయని వారు వెల్లడించారు. దుర్గమాంబ ఆశీస్సులతో మూడు గ్రామాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

# జిల్లాలో చల్లబడ్డ వాతావరణం

**- పలు మండలాల్లో వర్షం - ట్రాక్టర్లు, ఎద్దులతో దుక్కి దున్నే పనులకు సిద్ధమవుతున్న అన్నదాతలు**





పొలాన్ని ట్రాక్టర్, నాగళితో దున్నుతున్న రైతన్నలు

**అనంతపురం, మే 18 ప్రభాతవార్తబ్యూరో**

అనంతపురం జిల్లాలో వాతావరణం చల్లబడింది. గత రెండు నెల లుగా ఎక్కువ ఉష్ణోగ్రతలతో ఎండలు ఎక్కువై ప్రజలు ఇక్కట్లకు గుర య్యారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడిన రోజు లు ఎన్నో.. అయితే గత వారం రోజులుగా కొన్ని మండలాల్లో ఒక మోస్త రు, కొన్ని మండలాల్లో భారీ వర్షాలు రావడంతో వాతావరణం చల్లబ డింది. ఎండలు తగ్గుముఖం పట్టాయి. మూడు నాలుగు రోజులు వరా ్షలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు కూడా చెబుతు న్నారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లాలోని వివిధ మండలాల్లో కురిసిన వర్షపాత వివరాల ప్రకారం ఎక్కువ మండలాల్లో విస్తారంగా వర్షం కురిసినట్లు తెలుస్తోంది. శనివారం కురిసిన వర్షపాత వివరాలను జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి ఒక ప్రకటనలో ఆదివారం విడుదల చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. విడపనకల్లులో 95.4 మిల్లీమీటర్లు, ఉరవకొండలో 89.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. బెలుగుప్పలో 75.4, బొమ్మనహాల్‌లో 67.4, బ్రహ్మసముద్రంలో 56.4, గుంతకల్లులో 52.6, గుమ్మగట్టలో 52.2, కణేక ల్‌లో 46.8, రాయదుర్గంలో 45.6, కూడేరులో 42.4, గారదిన్నెలో 37. 6, ఎల్లనూరు లో 34.6, శెట్టూరులో 31, అనంతపురంలో 30.2, డి.హీరే హాల్‌లో 27.2, పామిడి 22.4, ఆత్మకూరు 20, తాడపత్రి, కళ్యాణ దుర్గంలో 19.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు నమోద యింది. అదేవిధంగా శుక్రవారం ఉరవకొండలో 52 మిల్లీమీటర్లు, విడపన కల్లులో 49 మిల్లీమీట ర్లు, గుత్తిలో 25, యాడికిలో 20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ విధంగా గత కొద్దిరోజులుగా వివిధ మండలాల్లో కురుస్తున్న వర్షాలతో వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం భూమిని ట్రాక్టర్లు, ఎద్దులతో దుక్కి దున్నే పనులలో, విత్త నాలు, ఎరువులు సమకూర్చుకునే పనిలో అన్నదాతలు ఉన్నారు.

02ATP18_02ATP18.qxd 18-05-2025 PM 10:54 Page 1



## మురళి కుటుంబానికి రూ.లక్ష సాయం

**-దేశభక్తిని చాటుకున్న కర్నూలు జిల్లా మహానంది అగ్రికల్చర్ ఓల్డ్ స్టూడెంట్స్**



జవాన్ తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందచేస్తున్న దృశ్యం

గోరంట్ల, మే 18 ప్రభాతవార్త

వీర జవాన్ మురళినాయక్ కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి కర్నూలు జిల్లా మహానంది వ్యవసాయ కళాశాల పూర్వపు విద్యార్థులు 1.03 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందచేసి తమ మానవత్వాన్ని, దేశభక్తిని చాటుకున్నారు. మహానంది వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం 2005 బ్యాచ్‌కు చెందిన పలువురు పూర్వ విద్యార్థులు ఆదివారం గోరంట్ల మండలంలోని కల్లితాండాలోని అమర వీరుడు మురళినాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మురళినాయక్ తల్లితండ్రులను పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 1.03 లక్షల రూపాయల నగదును అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరజవాన్ మురళినాయక్ మరణం తమను ఎంతో కలచివేసిందని పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలో వీరోచితంగా పోరాడి 14 మందిని చంపి పాకిస్తాన్ దొంగదెబ్బకు బలి అయిన సందర్భం తమ వాట్సాప్ గ్రూపులో పెద్దఎత్తున చర్చ జరిగిన అనంతరం వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వడమే కాకుండా తమ వంతు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకొని ఈ మొత్తాన్ని సమకూర్చి ఆయన తల్లిదండ్రులకు అందచేయటం జరిగిందన్నారు. మురళినాయక్ పోరాటం భావి తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని అలాంటి కొడుకును కన్న తల్లిదండ్రులను పరామర్శించడం తమ భాధ్యతగా భావించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రదేశాల నుండి ఇక్కడికి ఈ రోజు రావటం జరిగిందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల 2005 బ్యాచ్ ప్రతినిధులు ఎం.రమేష్‌నాయక్ (వ్యవసాయ శాస్త్రవేత్త, హైదరాబాద్), వ్యవసాయ అధికారులు వరప్రసాద్, ఇమ్రాన్, నరేష్ పాల్గొన్నారు. గోరంట్ల జెడ్‌పిటిసి పాలే జయరాంనాయక్ వీరిని దివంగత మురళినాయక్ తల్లిదండ్రులకు పరిచయం చేసి తోడ్పాటునందించారు.

## సాగునీరు, తాగునీరు అందించిన ఘనత బాలయ్యదే

**- టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప**

**- హిందూపురం జిల్లా చేయాలని తీర్మానం**

**- కోలాహలంగా మినీ మహానాడు**




ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప



పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు

హిందూపురం మే 18 ప్రభాతవార్త

43 ఏళ్లుగా హిందూపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుంటూ వస్తున్న టిడిపి కార్యకర్తలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట వడ్డే అంజనప్ప పేర్కొన్నారు.

ఆదివారం పట్టణంలోని జెవిఎస్ ఫంక్షన్ హాల్ లో హిందూపురం నియోజకవర్గం టిడిపి మినీ మహానాడు కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా అంజనప్ప మాట్లాడుతూ టిడిపికి ఓటమి ఎరుగని విజయాలను అందించిన హిందూపురానికి సాగునీరు తాగునీరు అందించిన ఘనత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దేనిని, ఈ విధంగా ప్రజల రుణం తీర్చుకున్నట్టు అయిందని కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలోనే హిందూపురాన్ని నెంబర్ వన్ స్థాయిలో అభివృద్ధి చేస్తానని ప్రకటించి దానిని అమలు చేస్తున్నారని కొనియాడారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్ కుమార్ మాట్లాడుతూ హిందూపురం పట్టణ రూపు రేఖలు మారే విధంగా వందల కోట్ల రూపాయల నిధులను బాలయ్య విడుదల చేయిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే రూ 92.5 0 కోట్లు మంజూరు కాగా త్వరలో రూ. 130 కోట్లు రానున్నాయని అన్నారు. సిమెంట్ రోడ్లు డ్రైనేజీల నిర్మాణం లైటింగ్ వ్యవస్థ అభివృద్ధి మెరుగైన నీటి సరఫరా కొత్త పైప్ లైన్ లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పనులు జరుగుతాయని చెప్పారు. ఎంపీ పార్థసారథి, మాజీ చైర్మన్ అనిల్ కుమార్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆనంద్ కుమార్, లేపాక్షి చిలమత్తూరు కన్వీనర్లు జయప్ప, రంగారెడ్డి తదితరులు ప్రసంగించారు తదితరులు ప్రసంగించారు. కాగా మినీ మహానాడులో పలు తీర్మానాలను చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని, పరిశ్రమల హబ్బుగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు పెంచాలని, హంద్రీ నీవా కాలువ వెడల్పు పనులు చేపట్టి నీటి సరఫరా మరింత మెరుగు పరచాలని తీర్మానంలో ప్రభుత్వాన్ని కోరారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, సీనియర్ నాయకులు నెట్టప్ప, దేమకేతేపల్లి అంజినప్ప, అమర్నాథ్, భాస్కర్, ప్రెస్ వెంకటేష్, అరుణాచల్ రెడ్డి, కౌన్సిలర్లు రఘు తదితరులు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు యుగంధర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మడకశిరలో కాండిల్ లైట్ డే కార్యక్రమం



కాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర మే 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ సహకారం తో ఫోర్డ్ సంస్థ మరియు ఐసిటీసీ మడకశిర, రోళ్ళ ఆధ్వర్యంలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ తో మరణించిన వారి జ్ఞాపకార్థం కాండిల్ లైట్ డే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమములో భాగముగా ఆదివారం మడకశిర లో కాండిల్ లైట్ డే ర్యాలీ ద్వారా హెచ్.ఐ.వి / ఎయిడ్స్ తో మరణించిన వారి జ్ఞాపకార్థం ప్రతి మే నెల మూడవ ఆదివారం ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో మడకశిర ఏరియా హాస్పిటల్ నుండి డాక్టర్ దివాకర్ గారు కౌన్సిలర్ ఐసీటీసీ నరసింహులు, రోళ్ళా ఐసిటీసీ అంజినప్ప,ఫోర్డ్ ఆర్గనైజషన్ పీడీ బదరిష్, మలింగప్ప, మూర్తి, ఏఎన్ఎం కవిత, ఓ.ఆర్.డబ్ల్యూ లు నాగేశ్వరీ, లలిత, అనిత, గీత, రంగలక్ష్మి, లక్ష్మి, సాకమ్మా, పీర్ ఎడ్యుకేటర్స్ మరియు హైరిస్క్ గ్రూప్ హెచ్ఆర్జిలు పాల్గొన్నారు.

## కూటమి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

హిందూపురం టౌన్ మే 18 ప్రభాతవార్త

ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా ఆదివారం హిందూపురం పట్టణంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీ పట్టణంలోని సుగురు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ తో పాకిస్థాన్కు తగిన బుద్ధి చెప్పామని అన్నారు ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి.ఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ పి.ఎ సురేంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజనప్ప, దుర్గా నవీన్, బిజెపి నాయకుడు మేడం వరప్రసాద్, జనసేన నాయకుడు ఆకుల ఉమేష్. కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివిధ శుభ కార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దృశ్యం

అగళి, మే 18 ప్రభాతవార్త

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి వివిధ శుభ కార్యాల్లో ఉన్నారు. రొళ్ల లక్ష్మి ప్యాలెస్‌లో మాజీ జడ్పిటిసి కుమారుని వివాహానికి హాజరైన నూతన వధువరులను ఆశీర్వదించారు. దాసేగౌడనపల్లి శివకుమార్ ఇంకో శుభ కార్యానికి హాజరయ్యారు. అదే విధంగా దేవరహట్టి గ్రామంలో వివాహానికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. గుడిబండ టిటిడి కళ్యాణమండలంలో టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్ అల్లుడు వివాహానికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. రామనపల్లికి చెందిన ప్రధానోపాధ్యాయులు రవి సోదరుని వివాహానికి హాజరైన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి, కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శి జయప్ప, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు కాశీ విశ్వనాథ స్వామి దేవాలయంలో పల్లకి సేవ...!



అర్చకులు ద్వారకానాథ శర్మ

ధర్మవరం, మే 18 ప్రభాతవార్త

పట్టణంలోని కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథ స్వామి దేవస్థానం నందు సోమవారం సాయంత్రం ఉయ్యాలోత్సవం పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కైప ద్వారకనాథ్ శర్మ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 7. 00 గంటలకు శివ భక్తాదుల మధ్య ఉయ్యాలోత్సవంతో పాటు పల్లకి సేవ వంటి కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. పల్లకి సేవ ఉత్సవానికి ఉభయ సేవ కర్తలుగా చెన్నమరెడ్డి గారి గోపాల్ రెడ్డి ఆయన సతీమణి కళావతిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. పట్టణంలోని అమ్మవారి అయ్య వారి భక్తులందరూ ఈ మహోన్నతమైన కార్యక్రమంలో పాల్గొని పునీతులు కావాలని ఆలయ నిర్వహకులు కోరారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడానికి దేవాలయ శివ భక్తాదులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## యూటీఎఫ్ వెల్ఫేర్ పాలసీ బాండ్లు పంపిణీ



పాలసీ బాండ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ధర్మవరం, మే 18(ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ వెల్ఫేర్ పాలసీ బాండ్లను యూటీఎఫ్ రాష్ట్ర కార్యదదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పం పిణీచేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు సంక్షేమం, ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని యూటీఎఫ్ పాలసీ బాండ్లను పంపిణిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగ ఆ యూటీఎఫ్ వెల్ఫేర్ పాలసీ బాండ్లను పంపిణీచేశామన్నారు.ఈ పాలసీలో భాగంగా యూటీఎఫ్ నాయకులు ఎవరైనా అనారోగ్య రీత్యా శస్త్ర చికిత్సలు అవ సరం అయితే ఈ పాలసీ ద్వారా రూ. లక్ష నుంచి 2లక్షల వరకు తక్షణసాయం, అలాగే ఒకవేళ మరణిస్తే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు యూటీఎఫ్ నాయకులకు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ పాలసీ విధానం రాష్ట్ర జిల్లా నాయకత్వానికి అలాగే పూర్వపు రాష్ట్ర, జిల్లా నాయకులకు వర్తింప జేసి వారికి బాండ్లను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ మేరివరకుమారి, జిల్లాకార్యదర్శులు లతా దేవి, రామకృ షనాయక్, ధర్మవరం జోన్నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, సకలచంద్రశేఖర్, అమలు చేసే విధంగా తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మేరివరకుమారి, జిల్లాకార్యదర్శులు లతాదేవి, రామ కృష్ణనాయక్, ధర్మవరం నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, సకల చంద్ర శేఖర్, పెద్దకోట్లసురేశ్,రాంప్రసాద్,సాయిగణేశ్, రామాంజినేయులు పాల్గొన్నారు.

## చేతివృత్తిదారుల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

ధర్మవరం, మే 18, ప్రభాతవార్త



మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జింకాచలపతి

చేతివృత్తిదారుల సమస్యల పరిష్కారంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అద్యక్షులు జింకా చలపతి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. చేతి వృత్తులు తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. చేతివృత్తులపై అనేక మంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చేతివృత్తిపై ఆదారపడి జీవిస్తున్న వారు పిల్లల చదువుకోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.వీరిపట్ల ప్రభు త్వాలు పట్టించుకోలేదన్నారు. చేతివృత్తుల సమస్యల కోసం పోరాటాలు సాగిస్తాం దన్నారు. ఈనెల 27న చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లాకమిటీని ఏర్పాటు చేయడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాయల్ మధు ఆధ్వర్యంలో ఘనంగా సాకే వీర జన్మదిన వేడుకలు



పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సాకే వీరాంజనేయులు.

అనంతపురం రూరల్, మే 18 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు పుట్టినరోజు వేడుకలు 48వ డివిజన్ కార్పొరేటర్ రాయల్ మధు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాకే వీరాంజనేయులు జన్మదినం సందర్భంగా రాయల్ మధు కార్యాలయంలో టిడిపి నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల్ మధు మాట్లాడుతూ నా సోదరుడితో సమానమైన, మిత్రుడు తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు జన్మదిన వేడుకలు టిడిపి నాయకులతో కలిసి నా కార్యాలయంలో ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేయించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సాకే వీరాంజనేయులు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకొని తెలుగుదేశం పార్టీలో అంచల అంచలగా ఎదిగి మరిన్ని ఉన్నత పదవులు స్వీకరించాలని, అదేవిధంగా సాకే వీరాంజనేయులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని ఆ దేవున్ని కోరుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సలీం,రాజేష్ బండారు చంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

## నేడు మడకశిరలో మినీ మహానాడుకు తరలిరండి

అమరాపురం మే18 ప్రభాతవార్త

నియోజకవర్గస్థాయి మహానాడు కార్యక్రమం మినిమహానాడును మడకశిర పట్టణంలోని ఎం.ఎల్.ఎ క్యాంపు కార్యాలయంలో నేడు సోమవారం ఉదయం 10.00 గంటలకు మడకశిర నియోజకవర్గ శాసనసభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యుడు ఎం.ఎస్.రాజు, మాజీ శాసన మండలి సభ్యుడు, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ పంచాయతీ స్థాయి కమిటీలలోని సభ్యులు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపిటీసీలు, వార్డు సభ్యులు, ఆయకట్టు సంఘం సభ్యులు, విద్యా కమిటీ సంఘాల సభ్యులు, డీలర్లు, తదితర ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని ఈ మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు.

## ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త అజిత్‌కుమార్ దంపతులకు ఘనంగా వీడ్కోలు

ఉరవకొండ, మే 18 ప్రభాతవార్త



ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త అజిత్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అమెరికాలోని టెక్సస్ రాష్ట్ర రాజధాని ఆస్టన్ సిటీలోని లయండర్ పట్టణంలోని బైసన్ కమ్యూనిటీ ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురంకు చెందిన ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త అజిత్‌కుమార్, మంజుల దంపతులను ఘనంగా సన్మానించింది. దాదాపు 6 నెలలపాటు అమెరికాలో తన కుటుంబవద్ద ఉండి తిరిగి స్వదేశం ఇండియాకు బయలుదేరుతున్న సందర్భంగా వారి 47వ వివాహ వార్షికోత్సవం నేపథ్యంలో ఘనంగా సన్మానించి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన తెలుగువారు పాల్గొన్నారు.

## ఉచిత సామూహిక వివాహాలు




ఉచిత సామూహిక వివాహాల దృశ్యం

చెన్నేకొత్తపల్లి, మే, 18(ప్రభాతవార్త)

చెన్నెకొత్తపల్లి మండల పరిధిలోని బసంపల్లి క్రాస్ లో, సద్గురు యోగి నారాయణ మఠం ఆధ్వర్యంలో దాతల విరాళాలతో, ఆదివారం ఎనిమిది నిరుపేద జంటలకుఉచిత సామూహిక వివాహాలు చేశారు, ఈ సందర్భంగా, దాతలు అరుణ్‌కుమార్, సురేష్, కుళ్లాయప్ప, నూతన దంపతులకు వివాహ వస్త్రాలుతో పాటు తాళిబొట్లు, కాలిమెట్లు అందజేశారు. వివాహ, సందర్భంగా దంపతులను మ్నట నిర్వాహకులు ఆశీర్వదించారు, వివాహాల అనంతరం వారికి వారి కుటుంబ సభ్యులకు వివాహ కార్యక్రమాలకు హాజరైన వారికి భోజన సౌకర్యం కల్పించారు, ఈ కార్యక్రమంలో మ్నట నిర్వాహకులు నామాల శ్రీనివాసులు నిమ్మలకుంట ఆదినారాయణ, జింకా రాజేంద్రప్రసాద్, నరస వెంకట రాముడు, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించిన మడకశిర పోలీసులు



స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ గురించి మాట్లాడుతున్న సిఐ

మడకశిర మే 18 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పిలుపు మేరకు ఎస్పీ రత్న ఆదేశాల మేరకు మడకశిర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్"కార్యక్రమంను నిర్వహించారు. స్టేషన్లో శుభ్రం చేయడంతో పాటు ఈ స్వచ్ఛంద కార్యక్రమంలో పాల్గొని స్టేషన్లో ఆవరణంలో వర్షపు నీరు నిలువ ఉంచుకునే విధంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంతో పాటు,పరిసరాల పరిశుభ్రత, చెత్త చెదారం తొలగించారు. పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, ప్రజలకు శుభ్రత పై అవగాహన పెంచేలా ఈ కార్యక్రమాన్ని మడకశిర పోలీస్ లు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఐ నగేష్ బాబు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎంఎల్ఏ కాపు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కాపు

రాయదుర్గం టౌన్, మే 18, ప్రభాతవార్త

రాయదుర్గం పట్టణానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ బోయ్ మల్లికార్జున కుమారుడు లోకేష్ , పూర్ణ ప్రజ్ఞ వివాహంకు మాజీ ఎమ్మెల్యే కాపు రామ చంద్రారెడ్డి ఆదివారం హాజరైయ్యారు.నూతన దంపతులను సుఖ సంతోషంగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ వివాహ కార్యక్రమంలో డి. హిరేహాల్ వైకాపా మాజీ కన్వీనర్ బోయ వన్నూరు స్వామి మాధవరెడ్డి సురేష్ యాదవ్ పవన్ కుమార్ తదితరులు పాల్గొని నూతన దంపతులు లను ఆశీర్వదించారు.

## మిద్దె కూలి పశువులు మృతి

**- దాదాపు 3లక్షల ఆస్తి నష్టం - ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు ఆవేదన**

**- 10వేలు సాయం అందించిన తెదేప నాయకులు**



చనిపోయిన పశువులను చూపుతున్న గ్రామస్తులు

కనేకల్లు మే 18, ప్రభాతవార్త

కనేకల్లు మండల పరిధిలోని రచ్చుమరి గ్రామంలో శనివారం రాత్రి నుండి ఆదివారం వేకువ జాము 2 గంటల దాక ఉరుములు,మెరుపులతో భారీ వర్షం పడింది.46.8 మిల్లీమీటర్ల రెవెన్యూ లో వర్షపాతం నమోదైంది.రచ్చుమర్రి గ్రామీణంలో పాడి రైతు మొండేలు హనుమంతు సొంత పొలంలో షెడ్డు ఏర్పాటు చేసుకొని 12 పశువుల పెంపకం సాగిస్తున్నాడు.వర్షం పడిన నేపథ్యంలో పిడుగుల శబ్దానికి సిమెంట్ పెల్లల షెడ్డు కంపించి ఐరన్ ఆంగ్లార్లు గల మట్టి మిద్దే కూలి రెండు పోతులు, ఒక గేదే మృతి చెందగా మరో 4 పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. మృత్యువాత పడ్డ రెండు పోతుల విలువ రూ.1.50 లక్షలు , గేదె విలువ రూ .60 వేలుగా ఉందని బాధిత రైతు కుటుంబం కన్నీటి పర్యంతం చెందింది.ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ఆదేశాలమేరకు తెదేపా రాష్ట్ర వాల్మీకి సాధికార సభ్యులు,కణేకల్లు మండల మాజీ కన్వినర్ కళేకుర్తి సుదర్శన్ గ్రామ సర్పంచ్ రుద్రమణి ఆద్వర్యంలో బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించి ఎమ్మెల్యే కాల్వాన్న ఆదుకోవడం జరుగుతుంది అని భరోసా ఇచ్చారు. పశుసంవర్ధక శాఖ ఎల్ఎస్ఏ సత్యనారాయణ సకాలం లో దెబ్బతిన్న పశువులకు సిబ్బంది చేత వైద్య చికిత్స అందించారు.

## రేపు పెన్నహోబిళం లక్ష్మినరసింహుని హుండీల లెక్కింపు

**-ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు**

ఉరవకొండ, మే 18 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి హుండీ కానుకల లెక్కింపు ఈనెల 20వ తేదీన మంగళవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించడం జరుగుతుందని తెలిపారు. హుండీ కానుకల లెక్కింపులో పాల్గొనే శ్రీవారి భక్తులుఉ సాంప్రదాయ దుస్తులైన తెల్లపంచె, కండువా మాత్రమే ధరించి రావాలని కోరారు.

## సజ్జగంట రంగనాథుని సన్నిధిలో హుయసల వీరబల్లాలుని శాసనం

**- గుర్తించిన చరిత్రకారుడు మైనాస్వామి**



ప్రాచీన శిలా శాసనాన్ని చూపుతున్న చరిత్రకారుడు మైన స్వామి తదితరులు

సోమందేపల్లి మే 18 ప్రభాతవార్త

సోమందేపల్లి మండలంలోని గుడిపల్లిలో గల సజ్జగంట రంగనాథ స్వామి గుడిలో దక్షిణం వైపున గోడపై హుయసల ప్రభువు మూడో వీరబల్లాలుని శాసనం మరియు ఆరుబయల్లో బృందావనంపై విజయనగర రాజ్య తొలినాళ్ల శాసనాన్ని గుర్తించినట్టు చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రమాకాంత్ రెడ్డి చారిత్రక పరిశోధకుడు వంగపల్లి గోపిలతో కలిసి రంగనాథస్వామి సన్నిధిని ఆయన ఆదివారం నాడు సందర్శించారు. గర్భగుడి ముందున్న అంతరాళంలో మరియు వెలుపలభాగంలో అధిష్టానంపై పలుశాసనాలున్నట్టు మైనాస్వామి గుర్తించారు. చాలావరకు శాసనాలు చదవడానికి వీలు కాకుండా రూపు చెదిరాయి. అయితే గర్భగుడి దక్షిణ గోడ అధిష్టానంపై గల ఒక శాసనాన్ని శాలివాహన శకవర్షం 1221 ప్రమాది సంవత్సరం మాఘ మాసం అంటే సామాన్య శకం 1299 జనవరి లేదా ఫిబ్రవరి నాటి శాసనంగా గుర్తించినట్టు చరిత్రకారుడు తెలిపారు. దోరసముద్రం(నేటి హాళేబీడు) రాజ్యంలో భాగమైన పెనుకొండసీమ హుయసల మూడో వీరనరసింహ కుమారుడైన మూడో వీరబల్లాలుని పాలన(1292-1343)లో ఉండేది. హుయసల ప్రభువు మూడో వీరబల్లాలుడు 1299లో గుడిపల్లిలోని సజ్జగంట రంగనాథ స్వామి సన్నిధిని నిర్మించి ఉండవచ్చని మైనాస్వామి వివరించారు. మూడో వీరబల్లాలుని శాసనాన్ని బట్టి గుడిప్రాముఖ్యతను,ఆలయ ప్రాచీనతను తెలుసుకోవచ్చు.

**బృందావనం:** ఆలయ ప్రాకారం వెలుపల గల బృందావనాన్ని సామాన్య శకం 1398లో సామాయ్యి అనే రాజ కుటుంబీకులు నిర్మించినట్టు చరిత్రకారుడు పేర్కొన్నారు. శాలివాహన శకవర్షం 1320 బహుధాన్య సంవత్సరం వైశాఖ మాసంలో బృందావనంపై శాసనాన్ని రాసారు. శ్రీవైష్ణవ మరియు శ్రీవెంకటేశ్వర దివ్యక్షేత్రాలలో ఒకటైన రంగనాథస్వామి అర్చనకైంకర్యాలు అప్పట్లో నిర్వహించిన పీఠాధిపతి హరిదేవకు సంబంధించిన సమాధి అయి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. పురాణ మరియు చారిత్రక ప్రాశస్తం గల శ్రీసజ్జగంట రంగనాథ స్వామి సన్నిధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి దేవాదాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన కోరారు. గుడిపల్లి రమేష్, పెనుకొండ శ్రీధర్, కడపల్లి శ్రీనివాస్,కడపల్లి వెంకటరమణ,సిరివేలు ముద్దప్ప, లక్ష్మీనారాయణ తదితరులు గుడిని సందర్శించిన వారిలో ఉన్నారు.

03ATP18_03ATP18.qxd 18-05-2025 PM 11:16 Page 1



# హిందూ ఆధ్యాత్మిక గురువు శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ

## - 26న శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ జన్మదినోత్సవ వేడుకలు
## - శ్రీ భగవద్గీత 12వ అద్యాయనంలోని శ్లోకాల స్మరణ పోటీలు
## - శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం సమన్వయకర్త ఎన్ఎస్ఎం శ్రీధర్

పామిడి, మే 18 ప్రభాతవార్త

హిందూ ఆద్యాత్మిక గురువు శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ అని ఆయనను దైవ స్వరూపునిగా భక్తులు భావిస్తారని శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం సమన్వయకర్త ఎన్ఎస్ఎం శ్రీధర్ పేర్కొన్నారు. ఈనెల 26న శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం నందు అవధూత దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించటం జరుగుతుందని సమన్వయకర్త ఎన్ఎస్ఎం శ్రీధర్ ఆదివారం 'ప్రభాతవార్త' ద్వార తెలిపారు. కర్ణాటకలోని మేకేదాటులో జన్మించిన శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ 1966లో మైసూర్ నందు అవధూత దత్తపీఠంను స్థాపించి అంతర్జాతీయంగా ఆద్యాత్మిక సాంస్కృతిక సాంఘీక సంక్షేమ సంస్థగా పీఠం మెగా ద్యానం సంగీత చికిత్స సామాజికసేవా కార్యక్రమాల ద్వార మానవ జీవితాన్ని సుసంపన్నం చేసే లక్ష్యంతో అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నారన్నారు. టెక్సాలోని అలెన్‌లో స్వామీజీ 2022లో వేలాదిమంది భగవద్గీత పఠించటం ద్వార అతిపెద్ద ఏకకాల హిందూ వచన పఠనం కోసం గిన్నిస్ వరల్డ్ పొందారని ఈకార్యక్రమం తమ బోదలను ప్రపంచ వ్యాప్తింగా ప్రచారం చేయటం విశేషం అన్నారు. శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ జన్మదినోత్సవ వేడుకలను పురష్కరించుకుని శ్రీ భగవద్గీత 12వ ఆద్యాయనంలోని శ్లోకాల స్మరణ పోటీలు జరుగుతాయని మహామంగళహారతి అన్నప్రసాద వితరణ అనంతరం ఎన్ఎస్ఎం సీతమ్మ కుమారుడు ఎన్ఎస్ఎం శ్రీధర్ గీతా కుటుంబం ఆద్వర్యంలో అనఘావ్రతాన్ని ఆచరిస్తారని వివరించారు. శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ, శ్రీ బాలస్వామీజీ దివ్య అనుగ్రహంతో జరుగబోయే ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం సమన్వయకర్త ఎన్ఎస్ఎం శ్రీధర్, ఉపాద్యక్షులు ఎం.హెచ్.లక్ష్మినారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, అర్చకులు అమరేంద్రస్వామిలను సంప్రదించాలని వెల్లడించారు.

# 21న నేమళ్ళపల్లి ఆలయ భూముల బహిరంగ కౌలు వేలం

పామిడి, మే 18 ప్రభాతవార్త

మండల పరిదిలోని నేమళ్ళపల్లి గ్రామంలోని శ్రీ ఆంజనేయ ఈశ్వర పోతులరాజు దేవత దేవాలయాలకు సంబందించి సర్వే నెంబర్లు 38, 39, 58-1, 58-3లోని మొత్తం 19.38 ఎకరాల భూములకు ఈనెల 21న బుధవారం బహిరంగ కౌలు వేలంను నిర్వహిస్తున్నట్లు సమూహ దేవస్థానముల కార్యనిర్వాహణాధికారి కృష్ణయ్య ఆదివారం 'ప్రభాతవార్త' ద్వార తెలియజేశారు. దేవాలయానికి బకాయిలు, లావాదేవీలు ఉన్నటువంటి వారు వేలంలో పాల్గొనకూడదని ప్రతి పాట దారుడు వేలంకు ముందు రూ.500 డిపాజిట్ చెలించి వేలంలో పాల్గొనవచ్చని తెలియజేస్తూ హిందూ దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల ఆదేశానుసారం ఈ బహిరంగ కౌలు వేలం జరుగుతుందన్నారు. మూడేళ్ళ పాటు భూములను కౌలుకు ఇస్తామని వేలం పాటు ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు పాడిన పాటు మొత్తాన్ని చెల్లించాలని అట్లు చెల్లించని పక్షంలో తిరిగి భూములకు వేలం నిర్వహిస్తామని తెలిపారు.

ప్రతిఏటా ఆర్థిక సంవత్సరానికి ముందుగా (మార్చి 31న) గుత్తను చెల్లించి భూమిలోకి ప్రవేశించాలని గుత్త చెల్లించని యెడల సదరు భూమిని రెండవసారి వేలం వేసిన సందర్భంలో ఏదైనా నష్టం జరిగినట్లైతే ఆ నష్టానికి మొదటి హెచ్చు పాటదారుడే పూర్తి బాధ్యుడని అయితే లాభంతో వారికి సంబందం లేదన్నారు. వేలంను వాయిద వేయటానికి రద్దు చేయుటకు ఇదేక్రమంలో ప్రభుత్వం కౌలు మద్యలో భూములను అమ్మ టానికి ఉత్తర్వులను జారీ చేస్తే వాటిని అమ్మేందుకు దేవాదాయశాఖ అధికారులకు పూర్తి అధికారం ఉందని అందువల్ల షరతులకు లోబడి ఈ వేలంలో పాల్గొనాలని సమూహ దేవస్థానముల కార్యనిర్వాహణాధికారి కృష్ణయ్య వెల్లడించారు.



.సమూహ దేవస్థానముల కార్యనిర్వాహణాధికారి కృష్ణయ్య.

# మీ మానవీయత అభినందనీయం..!

యాడికి(తాడిపత్రి), మే18, ప్రభాతవార్తః స్థానిక సాగర్ సిమెంట్స్ కర్మాగారంలో హెచ్ఆర్(మానవ వనరులు) మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ మీరు ప్రదర్శించిన మానవీయత, కంపెనీ బాధ్యతలు చాలా అభినందనీయమని శ్రీమన్నారాయణను ఉద్దేశించి సహోద్యోగులు, కంపెనీ సిబ్బంది పేర్కొన్నారు. కంపెనీ బీఎమ్ఎమ్‌గా అవతరించినప్పటి నుంచి సాగర్ సిమెంట్స్‌గా రూపాంతరం చెందిన నేటి వరకు 15 ఏళ్లుగా విధినిర్వహణలో ప్రజలతో సౌమ్యుడుగా, కంపెనీకి బాధ్యుడిగా మసలుకున్న తీరు శ్రీమన్నారాయణకు అటు కంపెనీలోనూ, ఇటు సమీప గ్రామాల ప్రజల్లోనూ ఓ ప్రత్యేకతను సంతరింపచేసింది. ఆయన పదవీ విరమణ పొంది ఇక్కడి నుంచి వెళ్లిపోతున్న సందర్భంగా కంపెనీ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందిస్తూ విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. కంపెనీకి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆయన అందించిన సేవలు మరువ లేనివని వారు పేర్కొన్నారు. శ్రీమన్నారాయణకు అభినందనలు తెలుపుతూ వీడ్కోలు పలికిన వారిలో వీపీ పాండు రంగారెడ్డి, జీఎమ్ ప్రభాకర్, ఇంజినీర్లు గంగాధర్, గోపి, సీఎస్‌వో వలి తదితరులు ఉన్నారు.



శ్రీమన్నారాయణను అభినందిస్తున్న సహోద్యోగులు, సిబ్బంది.

# గుంతలమయమైన అమడగూరు - బిల్లూరు ప్రధాన రహదారి

## -వాహనదారులకు తప్పని తిప్పలు

అమడగూరు, మే 18 ప్రభాతవార్త

మండలంలోని ఆమడగూరు - బిల్లూరు ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. కర్ణాటక సరిహద్దులో వున్న ఈ రహదారిపై అనునిత్యం రాకపోకలు సాగుతూ వుంటాయి. అయితే రహదారిపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అలాగే ఇదే రహదారిపై చింతామణి, బాగేపల్లికి వచ్చిపోయే వాహనాలకు ప్రమాదాలు జరిగే అవకాశం వుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. బాయపల్లి గ్రామం కూడలి వద్ద గుంతలమయమైన రహదారిపై బస్సులు ఇతర వాహనాలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై ఆదమరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఇక వర్షం వస్తే రహదారిపై నీరు నిల్వ వుండి రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారుతోంది. కొత్తవారు ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే జంకుతున్నారు. కావునా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకముందే రహదారికి మరమ్మతులు చేయించి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయమైన రహదారి

# రైతులు పండించే అన్ని పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి

పుట్లూరు, మే 18 ప్రభాతవార్త

రైతులు పండించే అన్ని పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2014 ఎన్నికల సందర్భంగా తమకు అధికారం ఇస్తే అన్ని పంటలకు మద్దతు ధరలు అమలు చేస్తామని 2021 నాటికి బిజెపి నరేంద్రమోడి పాలనలో రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు సరి కదా రైతులు అప్పులపాలయ్యారన్నారు. నరేంద్రమోడి ప్రభుత్వం అనుసరించిన రైతు వ్యతిరేక విధానాలతో గడిచిన 10 సంవత్సరాలలో 4 లక్షల మందికి పైగా రైతులు కూలీలు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతులు పండించే అన్ని పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరకు చట్టం చేయాలని, ఎరువులు విత్తనాలు డిజిటల్ వ్యవసాయ పనిముట్లు ధరలు తగ్గించాలి వ్యవసాయంలో ప్రభుత్వంన పెట్టుబడి పెంచాలని, 2 లక్షల వరకు రైతుల బ్యాంకు రుణాలు రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయలు అన్నదాత పెట్టుబడి సాయం తక్షణమే రైతుల ఖాతాలో జమవేయాలన్నారు. కౌలు రైతులకు నూతన కౌలు చట్టం చేయాలని కౌలు రైతులకు అన్ని రైతుల సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఒకేసారి 20 వేల రూపాయలు వెంటనే జమచేయాలన్నారు. అలాగే ఆర్డీటి సేవలు నిలిచిపోకుండా ఎఫ్‌సిఆర్ఎ అనుమతులు కేంద్రం ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి రోజు కూలి 600లకు పెంచి, 200 రోజులు పని దినాలు కల్పిస్తూ పనిముట్లు ఇచ్చి కనీసం సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాలో హంద్రీనీవా కాలువ పదివేల క్యూసెక్కుల సామర్థంతో వెడల్పు చేసి పిల్ల కాలువలు ఏర్పాటు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ప్రాజెక్టులకు భూములు కేటాయింపును రద్దు చేయాలి సోలార్ కంపెనీల నుండి రైతుల భూములను కాపాడాలని రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, మండల కార్యదర్శి టి.పెద్దయ్య, సిఐటియు రాఘవరెడ్డి, వెంకటచౌదరి, జె.పెద్దయ్య, ఆదినారాయణ, రంగప్ప, నాగముని, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

# లక్కినేనివారి వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే జె.సి



వధూవరులతో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మే 18 ప్రభాతవార్త

మౌర్య స్కూల్స్ కరెస్పాండెంట్ లక్కినేని ఆంజనేయులు కుమారుడు హరిప్రసాద్, పద్మభార్గవిల వివాహ వేడుకకు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తాడిపత్రి పట్టణ సమీపంలోని పుట్లూరు రోడ్డులో వున్న ఎఎన్ఆర్ గార్డెన్స్ కళ్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకకు ఎమ్మెల్యే జె.సి హాజరై నవవధూవరులు హరిప్రసాద్, పద్మభార్గవిలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ వివాహ వేడుకకు తాడిపత్రి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, రాజకీయ నాయకులు, తదితరులు పెద్దఎత్తున హాజరయ్యారు.

# మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్ అందచేసిన దృశ్యం

యాడికి, మే 18 ప్రభాతవార్త

మండల కేంద్రలోని సంత మార్కెట్ వీధిలోని దుర్గమ్మ అనే వృద్ధురాలు ఇటీవల పక్షవాతానికి గురై మంచానికే పరిమితమైంది. దీంతో వృద్ధురాలి కుటుంబసభ్యులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డిని సంప్రదించగా ఆయన తక్షణమే స్పందించి తమ ఫౌండేషన్ తరుపున వృద్ధురాలికి ఓ వీల్ చైర్ ను అందచేశారు. దీంతో దుర్గమ్మ కుటుంబ సభ్యులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలియచేస్తూ వారు చేసే ఉచిత సేవల్లో అనాధ మృతదేహాల అంతక్రియలు, అత్యవసర సమయంలో రక్తం అందచేయడం లాంటి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు ఆలూరు చంద్రశేఖర్‌రెడ్డి, బండారు బాలకృష్ణ, వైద్య సిబ్బంది లాల్‌మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే



ర్యాలీలో పాల్గొన్న దృశ్యం

తాడిపత్రిటౌన్, మే 18 ప్రభాతవార్త

తాడపత్రి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుండి అశోక్ పిల్లర్ వరకు కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఏరియా ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ శివశంకర్‌రెడ్డి, టిబి సూపర్‌వైజర్ సునీల్, మాస్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ పియు 2 తాడిపత్రి ప్రాజెక్ట్ మేనేజర్ జగన్నాథ్‌రెడ్డి, ఏంఇఎ సుధాకర్, ఎఎన్ఎం విజయలక్ష్మి, ఓఆర్‌డబ్ల్యూ హామీద, హాజరా, సునీత, కీజీయా పీర్ ఎడ్యుకేటర్స్, సుకన్య ఎఎన్‌పి+సి ఎస్‌సి 2.0 క్లబ్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# రైతు సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి

తాడిపత్రిటౌన్, మే 18 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని నంద్యాలరోడ్డులో వున్న రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం సుందరయ్య 40వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి మాట్లాడుతూ సుందరయ్య ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలిచి ఎంతో మందిని ఆదరించి ప్రజలకు సేవ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆయన తెలంగాణ సాయుధ పోరాటం, మహాత్మాగాంధీతో కలిసి చేసిన ఉప్పు సత్యాగ్రహం లాంటి పోరాటాలను గుర్తు చేసుకుంటూ ఆయన చేసిన త్యాగ, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని అనేక ఉద్యమాలు భవిష్యత్తులో కొనసాగించాలని, ఆయన లక్ష్యసాధన కోసం ప్రజలను చైతన్యవంతులు చేస్తూ పోరాటాలను నిర్వహించాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జయ శేఖర్‌రెడ్డి, ప్రజాశక్తి ఆది, శిరీష, గౌరీ, నందిని పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# 46 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

కంబదూరు, మే 18, ప్రభాతవార్త

కంబదూరు మండల పరిధిలోని ములకనూరు తిమ్మరాయప్ప కొండ గ్రామ శివారులలో పేకాటాడుతున్న 46 మందిని ఆదివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్ట్ చేశారు. రాబడిన సమాచారం మేరకు కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నీలకంఠేశ్వర, ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, వారి వద్ద నుంచి రూ.232,300 నగదును సీజ్ చేసి , నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మీడియాకు తెలియజేశారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ ఓబుళపతి స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

తనకల్లు, మే 18 ప్రభాతవార్త

భారీ వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తగా వుండాలని ఇన్‌చార్జ్ తహశీల్దార్ మల్లికార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు 5 రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. కావునా గ్రామాల్లోని ప్రజలు జాగ్రత్తగా వుండాలన్నారు. అలాగే ఏమైనా ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరిగిన వెంటనే తహశీల్దార్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ విఆర్‌ఓలు పి.గంగాధర్ 7989194386, ఎస్.మోదీన్‌బాషా 9492548697, విఎస్‌లు శాంతిబాయి 7799892099, హెచ్.ఎం షాషావలి 7569946740లకు తెలియచేయాలన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న పలువురు నేతలు



వివాహ వేడుకలో పాల్గొన దృశ్యం

గుత్తి, మే 18 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని స్పందన ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, ఉపాధ్యాయుడు నాగరాజు కుమార్తె వివాహ వేడుకలలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా, టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, వైకాపా జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డితో పాటు పలు పార్టీల నాయకులు, తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# ఎయిడ్స్ బాధిత మృతులకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గుత్తి, మే 18 ప్రభాతవార్త

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం మరియు హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం క్యాండిల్ లైట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి ఎయిడ్స్‌తో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, వెంకటేశులు, అమర్, కవిత, లావణ్య, కృష్ణవేణి, రాధా, విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

# మినీ మహానాడును విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండారు ఆనంద్

గుంతకల్లు, మే 18 ప్రభాతవార్త

పట్టణంలోని బలిజ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్యక్రమానికి ఎంపి అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, తదితర పార్టీ నాయకులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, మండల నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

**4 గంటలకు తిరంగా యాత్ర :** మినీ మహానాడు అనంతరం సాయంత్రం 4 గంటలకు పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి ఎన్‌టిఆర్ సర్కిల్ వరకు తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

# నేడే వైస్ ఎంపీపీ ఎన్నిక




కంబదూరు, మే 18, ప్రభాతవార్త

కంబదూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యాలయం పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు పోలీసులు మీడియాకు తెలిపారు. వంటారెడ్డి పల్లి సెగ్మెంట్ ఎంపీటీసీ సోమశేఖర్ ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచడంతో వైస్ ఎంపీపీగా ఆయనను ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకునే అవకాశం కనిపిస్తుంది. ఉదయం 10 గంటలకు ఎంపీటీసీ సభ్యులు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకోవాలని అధికారులు ప్రకటనలో తెలియజేశారు.

# శ్రీఅశ్వత్థనారాయణస్వామికి పంచామృతాభిషేకాలు



శ్రీఅశ్వత్థనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

పెద్దపప్పూరు, మే 18 ప్రభాతవార్త

మండలంలోని చిన్న పప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీఅశ్వత్థ నారాయణ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీఅశ్వత్థనారాణస్వామికి అర్చకులు పంచా మృతాభికాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీఅశ్వత్థ నారాయణ స్వామి, శ్రీచక్రభీమలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా, మా కక్షిదారుడైన మల్లి లింగమూర్తి S/o మల్లి రామన్న (లేట్) బిసి కాలనీ, కొత్తచెరువు, ఈ క్రింది డాక్యుమెంట్ నెంబర్ కలిగిన ఆస్తి పత్రము 2096/1997 మరియు 14489, తేది 25.10.1997 జిరాక్స్ తీసుకొని ద్విచక్ర వాహనంలో కొత్తచెరువు నుండి బుక్కపట్నం వెళుతుండగా పోయినవి. ఈ విషయమై కొత్తచెరువు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసి వారి నుండి అక్నాలెడ్జ్‌మెంట్ పొందిఉన్నాము. కావున తమ వద్ద ఈ పత్రమునకు సంబంధించిన జిరాక్స్ కాపీలు మాత్రమే ఉన్నవని తెలియ జేసినాము. కావున ఎవరికైనా ఈ ఆస్తిపత్రములు గురించి కానీ, ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఈ ప్రకటన వెలవడిన తరువాత మాకు తెలుపగోరుచున్నాము.

04ATP18_04ATP18.qxd 18-05-2025 PM 10:52 Page 1



# వర్షానికి కారిన ఆర్టీసీ హైటెక్ బస్

## జర్నీలో తడిసిపోయిన ప్రయాణికులు, లాప్టాప్ లు - కదిరి, హిందూపురంలలో ధర్నా

హిందూపురం మే 18 ప్రభాతవార్త

ఏపీఎస్ఆర్టీసీ హిందూపురం డిపోకు చెందిన తిరుపతి హైటెక్ బస్సు కాలం చెల్లి గుజరీ దశకు చేరుకున్నప్పటికీ ఆర్టీసీ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా వర్షానికి జర్నీలో ప్రయాణికులతో పాటు వారి లాప్ టాప్ లు, ఇతర లగేజీ కూడా తడిచిపోయిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆర్టీసీ అధికారుల పై ప్రయాణికులు తిరగబడి కదిరి, హిందూపురం బస్టాండ్ లలో ఆందోళనకు దిగిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి నుంచి శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో హిందూపురాని కి(ఏపీ 02 జెడ్ 0399) బస్సులో 35 మంది ప్రయాణికులు ఎక్కారు. తెల్లవారుజామున మదనపల్లి ప్రాంతంలోకి బస్సు రాగానే భారీ వర్షం కురుస్తుండడంతో ఒకసారిగా బస్సు టాప్ పైన నుంచి నీరు కారణం ప్రారంభమైంది. దీంతో ఒక్కసారి ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. మహిళలు, చిన్నారులు కూడా వర్షపు నీటిలో తడిచిపోయారు. మార్గమధ్యంలో బస్సును ఎక్కడ నిలిపివేయడానికి వీలు కాకపోవడంతో అలాగే బస్సులో ప్రయాణికులు తడుస్తూ కదిరికి వచ్చారు. కదిరిలో బస్సు ఎదుట ప్రయాణికులు ఆందోళనకు దిగారు. డ్రైవర్, కండక్టర్ల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఏ మార్గంలో, ఏ బస్సులు వేయాలన్న విషయం అధికారులకు సంబంధించినదని కేవలం తమ డ్యూటీ మాత్రమే తాము చేస్తున్నామని ఇందులో తమ తప్పేమీ లేదని డ్రైవర్, కండక్టర్లు వాపోయారు. కదిరి నుంచి హిందూపురం వెళ్లేందుకు మరో బస్సును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు పట్టుబట్టారు. దీంతో ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయంగా మరో బస్సును ఏర్పాటు చేయడంతో వారు హిందూపురం చేరుకున్నారు. ఉదయం 6:30 గంటల ప్రాంతంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. డొక్కు బస్సులను నడుపుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందుల్లో కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. బస్సులో మహిళలు తడిచిపోవడంతో పూర్తి అసౌకర్యంగా, ఇబ్బంది కరంగా తమ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లల బట్టలు తడిచిపోయాయని, పిల్లలు చూస్తే ఏడుస్తూనే ఉన్నారని



ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

ఇలాంటి డొక్కు బస్సులను పంపిన వారిని దేనితో కొట్టాలని తీవ్రంగా మండిపడ్డారు. కాగా ఇదే డొక్కు హైటెక్ బస్సులో గత ఏడాది కూడా తిరుపతి నుంచి వచ్చే సమయంలో బస్సు అద్దాలు రన్నింగ్ లో పగిలిపోవడంతో ప్రయాణికులపై పడి గాయలపాలయ్యారు. తమ బాధ్యత రాహిత్యం, వైఫల్యాలను కప్పిపెట్టుకునేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నిస్తూ డ్రైవర్, కండక్టర్లను బాధ్యులు చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**త్వరలో కొత్త బస్సులు ఏర్పాటు :** డిఎం శ్రీకాంత్ హిందూపురం డిపోకు చెందిన తిరుపతి బస్సు వర్షానికి కారుతూ ప్రయాణికులు అసౌకర్యానికి గురి కావడంపై ఆర్టీసీ డిఎం శ్రీకాంత్ మాట్లాడుతూ త్వరలో కొత్త సర్వీసు వేస్తామని వివరించారు. ఈ బస్సు 13 లక్షల కిలోమీటర్లు తిరిగిందని కొన్ని టెక్నికల్ సమస్యలు తీరాక కొత్త సర్వీస్ తప్పక ఏర్పాటు చేస్తా మన్నారు. హైదరాబాద్ విజయవాడ చెన్నై రూట్ లకు ఇప్పటికే కొత్త బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని త్వరలో మిగిలిన రూట్ లకు కూడా సౌకర్యం కల్పిస్తామన్నారు.

# ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

## - ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి

అనంతపురం న్యూటౌన్, మే 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యా శాఖలో జరుగుతున్న అసంబద్ధ అస్తవ్యస్త నిర్ణయాల పట్ల, ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకుండా కేవలం ఆంగ్లమాధ్యమంలో విద్యను కొనసాగించడం వల్ల విద్యార్థుల మానసిక సృజనాత్మక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడంలో వెనుక బాటుకు గురి అవు తారన్న ఆందోళన వ్యక్తం చేస్తూ, గత ఐదు సంవత్సరాల కాలంలో తెలుగు మాధ్యమం కోసం, నిర్లక్ష్యానికి గురవుతున్న తెలుగు భాష కోసం ఎన్నో పోరాటాలు చేసామని, కూటమి ప్రభుత్వం కూడా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించడంలో గత ప్రభుత్వ మార్గాన్ని అనుసరిస్తోందని తెలియజేస్తూ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివా సరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, రాష్ట్ర, రాయలసీమ జిల్లాల బాధ్యులు కలిసి హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుని, మాజీ అధికార భాషా సంఘ అధ్యక్షులు మాడుగుల నాగఫణి శర్మని కలిసి ఆంధ్రరాష్ట్రంలో తెలుగు భాషా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వారిరువురూ వెంటనే స్పందించి పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వెంటనే పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌తో ఫోన్లో సంప్రదించి ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగించాలని ఈ విషయమై తాను ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లా డతానని తెలియజేసినట్లు తెలిపా రన్నారు.

హైదరాబాదు లోనే నివాసం ఉంటున్న మాజీ అధికార భాష సంఘ


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అధ్యక్షులు బ్రహ్మశ్రీ శతావధాని మాడుగుల నాగఫణి శర్మని కలిసి ఇదే విషయమై చర్చించగా ఆయన ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు భాష అమలు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ తాను తక్షణమే సంబంధిత నాయకులు అధికారులతో మాట్లాడతానని ప్రాథమిక స్థాయిలో తెలుగు భాష అమలు ఆవశ్యకతను తెలియజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కోశాధికారి భోగా గంగాధర్. మద్దిలేటి రాయలసీమ జిల్లాల ఎస్ఎల్టిఎ బాధ్యులు జి.వేణుగోపాల్, సహదేవ రెడ్డి, మురళి, వెంకటరమణ, మధు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

# మహానాడు ఏర్పాట్లలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

అనంతపురం, మే 18 ప్రభాతవార్త బ్యూరో

పసుపు పండుగ "మహానాడు" కడప జిల్లాలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు, నిర్వహణ తదితర అంశాలపై చర్చించేందుకు ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశంలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు.




మహానాడు ఏర్పాట్లలో మంత్రులు, ఎమ్మెల్యేలతో అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

మహానాడు నిర్వహించే ప్రాంగణం లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రులు సవితమ్మ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. వారితో పాటు సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఆర్టీసీ కడప రీజినల్ చైర్మన్ పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# 10లో అత్యధిక మార్కులు సాధించిన యస్‌సి, యస్‌టి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

అనంతపురం న్యూటౌన్, మే 18 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా, శ్రీసత్య సాయి జిల్లాలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కటిక జయరామ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్జీఓ హోంఓ విద్యార్థులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డిటి చైర్మన్ తిప్పేస్వామి గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు గౌస్ మోదిన్, జి.యస్.టి.అసిస్టెంట్ కమిషనర్ సుబ్బరాయుడు, మాజీ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ప్రకాష్‌బాబు హాజరై ముందుగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించడం గర్వంగా ఉందని ఆర్‌డిటి చైర్మన్ తిప్పేస్వామి పేర్కొన్నారు. విద్యార్థుల యొక్క ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడం మంచి పరిణామం అని సంఘాన్ని అభినందించారు, గ్రంథాలయ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలకు విద్యను అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఎనలేని కృషి చేశారన్నారు. ఉద్యోగులందరూ కలసి సమాజంలో పేద విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం మంచిది అన్నారు. ప్రకాష్ బాబు మాట్లాడుతూ. .అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమం నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు కటిక జయరాం మాట్లాడుతూ.. పే బ్యాక్ టు ద సోసైటీ ద్వారా ఎక్కువ మంది యస్‌సి, యస్‌టి విద్యార్థులకు


మాట్లాడుతున్న కటిక జయరామ

ఒక్కొక్కరికి ప్రైజ్ మనీ శాలువా ప్రశంసా పత్రాలను షీల్డ్ యిచ్చి ప్రోత్సహించామన్నారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం కావ డానికి ప్రతి ఒక్కరి సహకారం ఉందని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజారమేష్, ఉపాధ్యక్షులు శాంతిముని హృషికేష్, కోశాధికారి లక్ష్మినారాయణ, ప్రచార కార్యదర్శి అంజనేయులు, కేశవయ్య, మనోహర, నరసింహులు, శాంతి స్వరూప్, పుల్లయ్య, రామంజినమ్మ, విజయకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రామగిరి ఎంపిపి ఉప ఎన్నిక - ఎన్నిక సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు

రామగిరి, మే 18 ప్రభాతవార్త

రామగిరి ఎంపిపి ఉప ఎన్నిక సోమవారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు గదిలో ఎన్నిక ఏర్పాట్లు చేశారు. ఎన్నిక గదిలోకి అనుమతించిన మీడియా ప్రతినిధులు తప్ప ఇతరులకు ప్రవేశం ఉండదన్నారు. గౌరవ సభ్యులుగా ఎంపి, ఎమ్మెల్యేలు హాజరుకావచ్చన్నారు. కాగా ఎన్నిక సందర్భంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డిఎస్పీ హేమంత్‌కుమార్, సిఐ శ్రీధర్ ఎంపిడిఓ కమలాబాయితో సమీక్షించారు.

ఎన్నిక గదిలోనూ, బయట సిసికెమెరాలను ఏర్పాటు చేయించారు. కాగా ఎన్నిక సందర్భంగా ప్రత్యేక పోలీసు బలగాలను దించారు. ఇద్దరు డిఎస్పీలు, 10 మంది సిఐలు, 18 మంది ఎస్ఐలు, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు మొత్తం 94 మంది, హోంగార్డులు 30 మంది, ఏపిఎస్పీ పోలీసులు రెండు ప్లటూన్స్ మూడు స్పెషల్ పార్టీ బృందాలు ఎన్నిక విధుల్లో శాంతి భద్ర తలను పరిరక్షిం చనున్నాయి. అదే విధంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.


సిద్ధం చేసిన ఎన్నికల కేంద్రం


ఎంపిపి ఎన్నికకు పోలీసు బందోబస్తుపై సమీక్షిస్తున్న డిఎస్పీ

# దళితులపై దాడుల ఆపకపోతే తిరుగుబాటు చేస్తాం

## - దాడులు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలం..సాకే హరి

అనంతపురం న్యూటౌన్, మే 18 ప్రభాతవార్త

దళితులపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్న వారు పద్ధతులు మార్చుకోకపోతే ప్రజాస్వామ్య బద్ధంగా తిరుగుబాటు తప్పదని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హెచ్చరించారు. ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న వరుస దాడులను ఖండిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. స్వయాన సీఎం సొంత జిల్లాలోనే దళితులపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉండడం నిదర్శనమన్నారు. అతి దారుణంగా చంద్రగిరి నియోజక వర్గంలో బీటెక్ విద్యార్థి మాల జేమ్స్‌పై యశ్వంత్ నాయుడు రౌడీ షీటర్లను కలిసి ఏకంగా కిడ్నాప్ చేసి రెండు రోజులు పాటు బంధించి చిత్రహింసలకు గురి చేస్తూ నోట్లో ఉచ్చ పోసి కులం పేరుతో దూషిస్తూ అతి కిరాతకంగా దాడి చేయడం ఘోరమన్నారు.

దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కొన్ని పేర్లు తొలగించుకొని వస్తేనే కేసు కడతామని చెప్పడం సరైనది కాదన్నారు. రౌడీలను నిందితులను పోలీసులే కాపాడాలనుకోవడం మరింత అన్యాయ మన్నారు. అలాగే కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మామిడి పళ్ళు తెంచారని ముగ్గురు దళిత మహిళలను గంటల తరబడి నిర్బంధించి కట్టెలతో కొడుతూ కాళ్లతో ఎక్కడి పడితే అక్కడ తన్నడంతో ఓ మహిళకు కర్ణబేరి దెబ్బతినిందన్నారు. కర్నూలు జిల్లాలో దళిత గుండమ్మను ట్రాక్టర్‌తో ఎక్కించి దుర్మార్గంగా చంపేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం మల్లాం లో దళితులను గ్రామ బహిష్కరణ చేయడం సిగ్గుచేటన్నారు. దళిత, గిరిజనులకు రక్షణ కరువైందని నాయకులు, అధికారులు చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామ న్నారు. కార్యక్రమంలో మాల మహానాడు ఓబులేసు, జై భీమ్ సేన బికేఎస్ ఆనంద్, సమత సైనిక్ దళ్ సుగామంచి శ్రీనివాసులు, ఫైట్ ఫర్ రైట్స్ కేపీ రాజు, సామాజిక కార్యకర్త సిగిలిరేవు రామాంజనేయులు, కుమార్, రాకెట్ల సూర్య నారాయణ, రమేష్ బాబు, నరసయ్య, రవి, నల్లప్ప, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాకే హరి

# ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల్లోనూ వర్గీకరణ అమలు చేయాలి

## - ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్



మాట్లాడుతున్న ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్

అనంతపురం న్యూటౌన్, మే 18 ప్రభాతవార్త

ఎస్సీ ఉద్యోగులకు పదోన్న తుల్లోనూ ఎస్సీ వర్గీకరణను అమ లు చేయించాలని మాదిగ సామాజిక వర్గానికి చెందిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్ర ధాన కార్యదర్శి బండారు శం కర్ విజ్ఞప్తి చేశారు. ఇమెయిల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ని కోరతామని తెలిపారు. ఏపీ విద్యాశాఖలోని టీచర్ల పదోన్నతులలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్నారు. కానీ, ఇతర ప్రభుత్వ శాఖల్లోని ఎస్సీ ఉద్యోగుల పదో న్నతుల్లో మాత్రం ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా అధికారులు మోకాలడ్డుతున్నారని, ఇది అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఈఎఫ్ జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు బండారు నాగేంద్ర, ఆర్.శ్రీనివాసులు, నగర అధ్యక్షులు మీసాల నాగభూషణ, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ డే దినోత్సవం



ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాండిల్ డే నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

కదిరి, మే 18 ప్రభాతవార్త

అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ దినోత్సవం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జన జా గృతి మేనేజర్ శ్రీనివాసులు, అరుణ, శివ జ్యోతులు మాట్లాడుతూ.. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారిని మ నం గుర్తు చేసుకుంటూ వారి పట్ల సంఘీభావం తెలుపు తు న్నామ న్నారు. హెచ్ఐవితో మృతి చెందిన వారిని స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని క్యాండిల్ లైట్ డేను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, జన జాగృతి సమస్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ధర్నాలకి ఆంధ్రప్రదేశ్ వైయస్ఆర్ టీచర్స్‌ఫెడరేషన్ సంఘీభావం


మాట్లాడుతున్న వైఎస్ఆర్‌టిఎఫ్ నేతలు

అనంతపురం న్యూటౌన్, మే 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ వైయస్ఆర్ టీచ ర్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం ఆంధ్రప్రదేశ్ వైయస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు అధ్యక్షతన జరి గింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వైయస్ ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఓబులపతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హెచ్.గిరిధర్ రెడ్డి హాజర య్యారు. విద్యా రంగం, ఉపాధ్యాయులు సమస్యలుపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగం, ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్న తులు విధానాలు అసం బద్ధంగా ఉన్నాయి. వీటికీ వ్యతిరేకంగా ఉపాధ్యా సంఘాలు, ఐక్యవేదిక చేస్తున్న ధర్నాలు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వైయస్ ఆర్ టీచర్స్ ఫెడరేషన్ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైయస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సురేష్ కుమార్, ఆదినారాయణ స్వామి, అల్తాఫ్ హుస్సేన్, జిల్లా గౌరవ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి త్యాగరాజు నాయక్, జిల్లా నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓకు శుభాకాంక్షల వెల్లువ

నంబులపూలకుంట, మే 18 ప్రభాతవార్త

నంబులపూల కుంట మండల నూతన ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన పార్థసారథిని మండల విద్యా శాఖ తరపున అభినందనలు తెలియజేసి మండల ఉపాధ్యాయ సమస్యలను చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్ నాయక్, ఎస్టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, పర్వత రెడ్డి, ఎఐఎస్ ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్ఆర్‌టిఎఫ్ నేతలు

# ఏపీటీఎఫ్ ప్రాథమిక సభ్యత్వం నుంచి బి.హనుమప్ప సస్పెన్షన్

అనంతపురం న్యూటౌన్, మే 18 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘంపై తీవ్ర విమర్శలు చేసిన అనంతపురం జిల్లా ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.హనుమప్పను రాష్ట్ర సంఘం రెండు సంవత్సరాల పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి తెలిపారు. రాష్ట్ర సబ్ కమిటీలో ఏర్పడిన రెండు ఖాళీలు భర్తీ నిమిత్తం అక్టోబరు 14, 15వ తేదీలలో రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సబ్ కమిటీ, కార్యవర్గ సమావేశంలో అత్యంత ప్రజాస్వామ్యయుతంగా రెండు ఖాళీలను భర్తీ చేశారని, అయినా హనుమప్ప అనంతపురం నుంచి పత్రికలకు రాష్ట్ర సంఘం అప్రజాస్వామ్యంగా వ్యవహరించిందని ప్రకటన చేయడం పట్ల రాష్ట్ర సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై లెటర్ నెంబర్ 163/2024లో హనుమప్పకి సంజాయిషీ కోరుతూ నోటీసు ఇచ్చినప్పటికీ సరైన సమాధానం ఇవ్వనందున అతనిని రెండేళ్లపాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని ప్రకటించారు.

# నేటి నుండి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

అనంతపురం న్యూటౌన్, మే 18 ప్రభాతవార్త

ఈనెల 19వ తేదీ నుండి 28వ తేదీ వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు, ఏసీ గోవింద నాయక్ ఆదివారం ఒక్క ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 42 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుండి 12:45 గంటల వరకు జరిగే పరీక్షలకు 11,493 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు 2998 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు ఆరు పరీక్ష కేంద్రాలు, ఇంటర్మీడియట్ పరీక్షలకు 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వచ్చే ఏడాది ఎస్ఎస్‌సి పదవ తరగతి పాత సిలబస్ రాసే విద్యార్థులకు ఇదే చివరి అవకాశం అని, అన్ని యాజమాన్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకుని ప్రతి విద్యార్థి పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా తెలియజేయడమైనది. విద్యార్థులు ఎక్కువగా బైక్ మీద కాకుండా బస్సులు, ఆటోలో సురక్షిత ప్రయాణం చేసే విదంగా చూసుకోవాలన్నారు. విద్యార్థులందరు చివరిక్షణం వరకు కంగారు పడకుండా పరీక్ష కేంద్రంకు ఒక గంట ముందుగానే హాజరయ్యేలా చూసుకోవాలని సూచించారు.

# నేడు రెండు ఎంపిపి ఒక వైస్ ఎంపిపి ఎన్నిక

అనంతపురం సిటీ, మే 18 ప్రభాతవార్త

జిల్లాలోని రెండు ఎంపిపిలు, ఒక వైస్ ఎంపిపి ఉప ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. గతంలో వాయిదా పడ్డ రామ గిరి, గాండ్లపెంట ఎంపిపి స్థా నాలకు సోమవారం ఎన్నిక జరగ నుంది. అదే విధంగా ఖాళీగా ఉన్న కంబ దూరు వైస్.ఎంపిపి స్థానానికి సైతం ఎన్నికలు నిర్వ హించనున్నారు. ఆయా స్థానాల ఎంపికకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## - ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, మే 18 ప్రభాతవార్త

సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కు మార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొం టారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్య లకు సంబంధించి అర్జీలను అందచేయాలని సూచించారు. అర్జీదా రులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాల ని సూచిం చారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్‌మెం ట్‌ను వాట్సాప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్‌మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్‌కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రశీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.


కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

# నేటి నుండి మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు

యల్లనూరు, మే 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నుండి శ్రీహనుమజ్జయంతి మహాసంప్రోక్షణ కుంభాభిషేకము మహోత్సవాలు ఘనంగా ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 22వతేదీ గురువారం వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శ్రీసీతా రాముల కళ్యాణం కన్నులపండువగా నిర్వహిం చనున్నారు. పెద్దఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని ఆంజనేయస్వామికి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు తెలియచేశారు.


శ్రీఆంజనేయస్వామి మూలవిరాట్టు